సాక్షి
కుమురం భీం
శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



పోడు కోసం చెట్ల నరికివేత

ఆదివాసీలు, అటవీశాఖ పోరులో విలువైన టేకు చెట్లు నేలకొరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజనులు అడవిలో చెట్లు నరికి భూమి చదును చేసేందుకు యత్నిస్తున్నారు. IIలో▸



ముందస్తు బతుకమ్మ వేడుకలు

జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఆడిపాడారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /25.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న మధుసూదన్

ఆసిఫాబాద్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీజీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి.మధుసూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం చీఫ్ ఇంజినీర్ ఆపరేషన్ -1 అశోక్‌తో కలిసి విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన పరికరాలు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఉద్యోగులు పనిచేసే సమయంలో అన్నిరకాల భద్రత పరికరాలు ఉపయోగించాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావు, డీఈఈలు, ఏడీఈలు, ఏఈఈలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



మాట్లాడుతున్న డీసీపీవో మహేశ్

ఆసిఫాబాద్‌రూరల్: బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని, యజమానులపై కేసులు సైతం నమోదు చేస్తామని డీసీపీవో బూర్ల మహేశ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలో శుక్రవారం బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. 14 ఏళ్లలోపు బాలబాలికలను విధిగా పాఠశాలలకు పంపించాలన్నారు. బాల్య వివాహాలు చేయకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్యవివాహాల గురించి సమాచారం ఉంటే 1098 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి దేవిక, హెచ్‌ఎం నరహరి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి



కోర్టు ఎదుట న్యాయవాదులు

ఆసిఫాబాద్: న్యాయవాదుల రక్షణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం న్యాయవాదులతో కలిసి కోర్టు విధులు బహిష్కరించారు. రక్షణ చట్టం అమలు చేయాలని సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి చేపట్టిన నిరాహార దీక్ష పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం, హైదరాబాద్ మెట్రో పాలిటన్ సిటీ క్రిమినల్ కోర్టులోని న్యాయవాదులు అనిల్, హనుమాన్ నాయక్‌పై కక్షిదారులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చరణ్, సీనియర్ న్యాయవాదులు ముక్త సురేశ్, బోనగిరి సతీశ్‌బాబు, నికోడె రవీందర్, కిశోర్, గణపతి, రామకృష్ణ, చంద్రకుమార్, రౌనక్ అగర్వాల్ పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 7న జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక బృందం విద్యార్థులు 30 నిమిషాలపాటు డ్రామా నిర్వహించాలని అన్నారు. విజ్ఞాన మహిళ, స్మార్ట్ వ్యవసాయం, డిజిటల్ ఇండియా, అందరి ఆరోగ్యం, గ్రీన్ టెక్నాలజీ అంశాలపై డ్రామా ఎంపిక చేసుకోవాలని సూచించారు.

వేతన పోరాటం!

- సమ్మెబాట పట్టిన డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్
- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వంటకు తిప్పలు
- పలుచోట్ల విద్యార్థులతోనే పనులు



జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్/తిర్యాణి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో వారు విధులు బహిష్కరించి ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. మరోవైపు వంట చేసేందుకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెగ్యులర్ సిబ్బంది అధికారులు, విద్యార్థులతో కలిసి వంట పనులు చేస్తున్నారు. జిల్లాలో 48 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉండగా, ఇందులో 68 మంది డైలీవేజ్ వర్కర్లు, 282 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. మొత్తం 450 మంది పనిచేస్తున్నారు. దాదాపుగా 11,560 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. హెడ్‌కుక్, కామటి, వాచ్‌మెన్ తదితర పనులు చేసే డైలీవేజ్ వర్కర్లకు రోజుకు రూ.619 చెల్లిస్తారు. ఇందులో ఏజెన్సీలో పనిచేసే వారికి నెలకు రూ.18 వేలు, నాన్ ఏజెన్సీ వారికి రూ.13,750, మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే వారికి రూ.15,000 అందుతున్నాయి. ఇక ఔట్‌సోర్సింగ్ కింద వసతిగృహాల్లో హెల్పర్, శానిటేషన్‌తోపాటు వాటర్, విద్యుత్, వాచ్‌మెన్ పనులు చేస్తున్న వారికి రూ.12వేలు చెల్లిస్తున్నారు.

హామీల అమలుకు డిమాండ్

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు అందడం లేదు. 2023లో సమ్మె చేసిన సమయంలో ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చకపోవడంతోనే సమ్మె చేపట్టినట్లు సిబ్బంది చెబుతున్నారు. 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా తమకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2012లో విడుదల చేసిన జీవో సవరించి 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్నవారిని షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, కొత్త మెనూతో పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, ప్రతీ కార్మికుడికి రూ.10 లక్షల ప్రమాదబీమా, మరణించిన కార్మికుల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగావకాశం, రిటైర్మెంట్ తర్వాత రూ.5 లక్షలు బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

విద్యార్థులతో వంట పనులు

సమ్మె కారణంగా రెగ్యులర్ సిబ్బంది, విద్యార్థులపై భారం పడుతోంది. ఎనిమిది, పది మంది చేయాల్సి పనిని ఇద్దరు, ముగ్గురే చేస్తున్నారు. వారం రోజులగా వంట పనులకు సైతం ఆటంకం కలుగుతోంది. పలుచోట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులే సిబ్బందికి సహకరిస్తున్నారు. విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తెలిపినా ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం.



ఆశ్రమ పాఠశాలలో వంట పనులు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పండుగలోపు చెల్లించాలి



ఏడు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబ అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. దసరా పండుగ లోపు వేతనాలు చెల్లించి న్యాయం చేయాలి.

– రాంబాయి, డైలీవేజ్ వర్కర్, చెలిమెల

ఎలా బతకాలి..?



30 ఏళ్లుగా తిర్యాణి మండలంలోని మంగీ పాఠశాలలో పని చేస్తున్న. బడ్జెట్ లేదు అంటూ ఏడు నెలలుగా జీతాలు ఆపారు. మేము ఎలా బతకాలి.

– గిరుజుబాయి, మంగీ పాఠశాల

వేతనాలు విడుదల చేయాలి



ఏళ్లుగా తక్కువ జీతానికి పనిచేస్తున్నా పర్మినెంట్ చేయలేదు. 12 నెలల వేతనం పూర్తిగా చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. వేతనాలు వెంటనే విడుదల చేయాలి.

– శశికళ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఆసిఫాబాద్

జీవో 64 రద్దు చేయాలి



గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వర్కర్లకు టైం స్కేల్ అమలు చేసి జీవో 64 రద్దు చే యాలి. కలెక్టర్ గెజిట్ ప్రకారం క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలి. ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలి.

– కృష్ణమాచారి, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు

విద్యార్థులతో పనులు చేయించొద్దు

ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైన చోట ప్రైవేట్ వ్యక్తులను నియమించాం. విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించొద్దు.

– రమాదేవి, డీటీడీవో

దసరాకు ఆర్టీసీ 'స్పెషల్'

- నేటి నుంచి ప్రత్యేక బస్సులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 414 సర్వీసులు
- ప్రయాణికులపై 50 శాతం అదనపు వడ్డింపు



ఆర్టీసీ బస్సు

ఆదిలాబాద్/మంచిర్యాలఅర్బన్: బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ వంటి దూర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు వచ్చే వారి కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 414 సర్వీసులు నడపాలని నిర్ణయించింది. నేటి నుంచి అక్టోబర్ 1వరకు నడిపేలా ఏర్పాట్లు చేస్తోంది.

నేటి నుంచి షురూ..

పాఠశాలలకు ఈనెల 21నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శని, ఆది రెండు రోజుల్లో విద్యార్థులు తమ సొంత ఊళ్ల బాట పట్టనున్నారు. ఆయా ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఉమ్మడి జిల్లాకు చేరుకోనుండడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఈనెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న దసరా పండుగలున్నాయి. తదనుగుణంగా బస్సులు నడిపేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రీజియన్ వ్యాప్తంగా మొత్తం 414 బస్సులను హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నడిపేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1వరకు రీజియన్ పరిధిలోని బస్సులు ఎంజీబీఎస్ నుంచి కాకుండా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఆదిలాబాద్‌లోని వివిధ డిపోలకు నడపనున్నారు. అలాగే అక్టోబర్ 5, 6 తేదీల్లో తిరుగు ప్రయాణం దృష్ట్యా రద్దీకి అనుగుణంగా స్పెషల్ బస్సులు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా..

పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం శనివారం నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు నిర్ణయించారు. ఒకే చోట 50 మంది విద్యార్థులు ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో మేనేజర్లను సెల్ నంబర్లలో సంప్రదిస్తే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తారు. ఆదిలాబాద్, ఉట్నూర్ డిపోల పరిధిలో (99592 26002), నిర్మల్(99592 26003), భైంసా(99592 26005), ఆసిఫాబాద్ (99592 26006) మంచిర్యాల (99592 26004) నంబర్లలో సంప్రదించవచ్చు.

రిజర్వేషన్ ఇలా..

పండగల దృష్ట్యా రిజర్వేషన్ చేసుకోవాలనే ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంచనున్నారు. అలాగే www. tgsrtcbus. in వెబ్‌సైట్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు.

రీజియన్ పరిధిలో కేటాయించిన ప్రత్యేక సర్వీసులు

డిపో	కేటాయించిన బస్సులు
ఆదిలాబాద్	85
భైంసా	20
నిర్మల్	123
ఉట్నూర్	5
ఆసిఫాబాద్	58
మంచిర్యాల	123

ప్రయాణికులపై అదనపు వడ్డన..

ఇప్పటికే మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో రద్దీ పెరిగింది. టికెట్ తీసుకున్న పురుష ప్రయాణికులు చాలా చోట్ల నిల్చొని ప్రయాణించాల్సిన పరిస్థితి. తాజాగా పండుగల వేళ స్పెషల్ బస్సుల్లోనూ రద్దీ ఉండనుంది. దీనికి తోడు ప్రత్యేక సర్వీసుల్లో ఏకంగా 50 శాతం అదనపు చార్జీ అమలుకు సంస్థ నిర్ణయించింది. దీంతో ప్రయాణికుల జేబుకు చిల్లు పడనుంది. గతంలో సూపర్ లగ్జరీ, లహరి, రాజధాని వంటి సర్వీసుల్లోనే అదనపు చార్జీలు వసూలు చేసిన సంస్థ ఈసారి పల్లె వెలుగు సర్వీసుల్లో కూడా అదనపు వడ్డనకు రంగం సిద్ధం చేసింది.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం



పండుగల దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపనున్నాం. రద్దీ దృష్ట్యా ముందస్తుగా రిజర్వేషన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే ఇబ్బందులు ఉండవు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల సౌకర్యార్థం (50 మంది ఉంటే) బస్సు కావాలనుకునే వారు డిపో మేనేజర్లను ఆయా నంబర్లలో సంప్రదించవచ్చు.

– ఎస్.భవానీప్రసాద్, ఆర్ఎంవో, ఆదిలాబాద్

వినూత్న పద్ధతుల్లో బోధించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విజేతలతో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు వినూత్న పద్ధతుల్లో పాఠ్యాంశాలు బోధించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి టీచింగ్ లర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం) మేళా నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రంలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగులో వాంకిడి మండలంలోని ఎంపీపీఎస్ భీంగూడ పాఠశాలకు చెందిన నగేశ్ కుమార్ మొదటి స్థానంలో నిలవగా, ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ ఎంపీపీఎస్ స్కూల్‌కు చెందిన హిమబిందు రెండోస్థానంలో నిలిచింది. ఇంగ్లిష్ టీఎల్ఎంలో తిర్యాణి మండలం ఉల్లిపిట్ట యూపీఎస్ ఉపాధ్యాయుడు వంశీకృష్ణ, దహెగాంలోని ముత్తపేట ఎంపీపీఎస్ టీచర్ సుప్రియ, గణితంలో ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ ఎంపీపీఎస్ టీచర్ భాగ్యలక్ష్మి, తిర్యాణి మండలం గంభీరావుపేట యూపీఎస్ టీచర్ రవి, ఈవీఎస్‌లో జైనూర్ మండలం లక్ష్మీపూర్ ఎంపీపీఎస్ టీచర్ ప్రమీల, సిర్పూర్(టి) యూపీఎస్ టీచర్ వెంకటేశ్, ఉర్దూ మీడియంలో కాగజ్‌నగర్ మండలం దంతన్‌గూడ యూపీఎస్ టీచర్ సుల్తానా ఉత్తమ టీఎంఎల్‌లు ప్రదర్శించారు. కార్యక్రమంలో నిర్వాహకులు క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉదయ్‌బాబు, ఎంఈవోలు సుభాష్, ప్రకాశ్, హనుమంతు, వెంకటేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలను సరిపోల్చాలి

ఆసిఫాబాద్: 2002, 2025 ఓటరు జాబితాలను పకడ్బందీగా సరిపోల్చాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2002, 2025 ఓటరు జాబితాలను సరిపోల్చేందుకు ఏబీసీడీ విభాగాలుగా విభజించాలన్నారు. ఈ నెల 23లోగా ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 24న నిర్ణీత నమూనాలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే కాగజ్‌నగర్ సబ్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల మ్యాపింగ్ పూర్తిచేసినట్లు తెలిపారు. 2022, 2025 ఓటరు జాబితాలను నాలుగు కేటగిరీలుగా విభజించి ఈ నెల 24న సమర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

లాభాల వాటా చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి డిమాండ్ చేశారు. గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం 2024– 25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలన్నారు. సొంతింటి పథకం అమలు చేయాలని, అలవెన్స్‌లపై ఐటీని యాజమాన్యమే చెల్లించాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, డిస్మిస్ కార్మికులకు మరోసారి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎం విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, అశోక్, మల్లేశ్, రమేశ్, ఓదెలు, షిఫ్ట్ ఇన్‌చార్జి అంజయ్య, వెంకటేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశల 'ప్రాణహిత'

- 17ఏళ్లుగా ఊరిస్తున్న 'ప్రాణహిత– చేవెళ్ల' ప్రాజెక్టు
- రూ.కోట్లతో తవ్విన కాలువలన్నీ ధ్వంసం
- తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో ఊరట
- వేగంగా నిర్మిస్తేనే ఈ ప్రాంత రైతులకు మేలు



నెన్నెల మండలం మైలారంలో కాలువ కోసం వేసిన పైపుల తరలింపు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గత పదిహేడేళ్లుగా ఉమ్మడి జిల్లా వాసుల చిరకాల కలగా ఉన్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణంపై మళ్లీ ఆశలు రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణానికి సాగునీటి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించడం ఈ ప్రాంత రైతులకు పెద్ద ఊరటనిస్తోంది. 2008లో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అటవీ అనుమతులు, కాలువల నిర్మాణం, భూ సేకరణ జరిగాయి. 2016లో టీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైనింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టింది. బరాజ్‌ను కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద కాకుండా మేడిగడ్డకు మార్చడంతో ఆ ప్రాజెక్టు పూర్తిగా మరుగున పడింది. తర్వాత ఈ ప్రాంత వాసులకు సాగునీటి కోసం డిమాండ్లు రావడంతో ప్రాణహిత, వార్ధా, పెన్‌గంగ నదులపై పలు చోట్ల తక్కువ ఎత్తులో సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల కోసం ప్రాజెక్టు కడతామని ప్రణాళికలు వేసినా ముందుకు కదల్లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రాణహిత కడతామని ఇచ్చిన హామీపై ఆచరణ దిశగా సాగుతోంది.

ప్రత్యేక చొరవ చూపితేనే..

చుట్టూ నీరున్నా ఒక్క భారీ నీటి పారుదల ప్రాజెక్టు లేక ఈ ప్రాంత రైతులు అల్లాడుతున్నారు. నీరులేక పత్తి, కంది తదితర ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. చాలాచోట్ల వర్షాధారమే దిక్కు. వానాకాలంలో పంట వేస్తే యాసంగిలో భూములు బీడుగా ఉంటాయి. రెండో పంట వేసుకోలేని దుస్థితి. పల్లెల్లో పనులు లేని సమయాల్లో వలస వెళ్తుంటారు. ఈ క్రమంలో సిర్పూర్ వంటి మారుమూల ప్రాంతంతోపాటు ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాల పరిసర రైతులకు సాగునీరందే అవకాశాలు ఉన్నాయి. ఏళ్లుగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాక సాగునీటికి దూరంగానే ఉంటున్నారు. మహారాష్ట్రతో గతంలోనే 148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి ఒప్పందం కుదిరింది. తాజాగా 150మీటర్ల ఎత్తు కోసం అనుమతికి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో నది అవతల గ్రామాల ముంపు, అటవీ అనుమతులు బరాజ్ నిర్మాణానికి ప్రధాన సవాళ్లుగా మారనున్నాయి. ఏటేటా నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం నిధుల ఖర్చులో ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది.

కాలువలు ధ్వంసం, పైపుల తరలింపు

తుమ్మిడిహెట్టి నుంచి చింతలమానెపల్లి, దహెగాం, వేమనపల్లి, నెన్నెల, మందమర్రి, మంచిర్యాల మండలాల మీదుగా నీళ్లు గోదావరిపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకోవాలి. మరో ప్యాకేజీలో ఎస్సారెస్పీ నుంచి నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌కు నీటిని తరలించాలి. కాళేశ్వరం రాకతో ఈ నీటి తరలింపు నిలిచిపోయింది. దీంతో 40కి.మీపైన తవ్విన కాలువలన్నీ ధ్వంసమయ్యాయి. చాలా చోట్ల కబ్జాలకు గురయ్యాయి. కొన్ని చోట్ల పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర ప్రజాప్రయోజనాలకు వాడుతున్నారు. ఇక కర్జెల్లి, సురగపల్లి, మైలారంలో రిజర్వాయర్ల నిర్మాణం కోసం భూ సేకరణ జరిగింది. వృథాగా ఉన్న పైపులను రెండేళ్ల క్రితమే ఇతర ప్రాంతాలకు తరలించారు. తాజాగా ఆ కాలువలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

గత ప్రాజెక్టు స్వరూపం

బరాజ్ నిర్మాణం: తుమ్మిడిహెట్టి
నీటి సామర్థ్యం: 160టీఎంసీలు
మొత్తం ఆయకట్టు: 16.40లక్షల ఎకరాలు
లబ్ధిపొందే జిల్లాలు: ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి
ఆదిలాబాద్ ఆయకట్టు: 1.56లక్షల ఎకరాలు

లబ్ధిపొందే గ్రామాలు: 1565	లిఫ్టులు 16
కాలువల పొడవు 512కి.మీ.	కాలపరిమితి: 4ఏళ్లు

అంచనా వ్యయం: రూ.38,500కోట్లు

చిత్తశుద్ధితో పూర్తి చేయాలి

మారుమూల ప్రాంత రైతులకు సాగునీరందించే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ప్రభుత్వం చేయడం సంతోషకరమే. కానీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రాజెక్టు పూర్తవుతుంది. బరాజ్ నిర్మాణంపై సమగ్ర అధ్యయనం చేయాలి. మహారాష్ట్రతో ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వ సహకారంతో మా వంతు కృషి చేస్తాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్

క్లుప్తంగా

అమ్మవారి సేవలో టీజీఎఫ్‌డీసీ చైర్మన్



అమ్మవారిని దర్శించుకుంటున్న దిల్‌రాజు

బాసర: తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు వీరికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మమ్మాయి రమేశ్, ప్రముఖ వ్యాపారవేత్త బచ్చువార్ రవికుమార్ ఘనస్వాగతం పలికారు.

బాలికల కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన బాలికల కబడ్డీ జిల్లా జట్టు

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మైదానంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలను ఎస్సై రాజశేఖర్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల నుంచి సుమారు 80 మంది బాలికలు పాల్గొనగా జిల్లా స్థాయిలో 15 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయం సాధించాలని ఎస్సై, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ సారా తస్లీమ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు ఆకాంక్షించారు.

పేకాడుతున్న 10మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.36,640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే, ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్‌చౌక్ లోగల వజ్ర ఫంక్షన్‌హాల్ టెర్రస్‌పై పేకాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు. వారి నుంచి రూ.470 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ శ్రీరామ్ నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు సీర్ల శ్రీనివాస్ (38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూనాగార్జున కాలనీకి చెందిన శ్రీనివాస్ శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–7 గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మిడిల్ షిఫ్ట్ విధులు నిర్వహించి సీసీసీ కార్నర్ వద్ద గల శ్రీరాంనగర్‌లోని ఆయన సొంత ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికుడు లెంకంటి సురేందర్ వెంటనే శ్రీనివాస్ తండ్రి సీర్ల నర్సయ్యకు సమాచారం ఇచ్చాడు. నర్సయ్య ఇంటికి వెళ్లి చూడగా శ్రీనివాస్ కాలిన గాయాలతో కిందపడి ఉన్నాడు. అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లున్నారు. కాగా, శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బంగారం కాజేసిన వ్యక్తి అరెస్ట్

మంచిర్యాలక్రైం: రూ.20లక్షల విలువైన బంగారు ఆభరణాలతో ఉడాయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సీఐ ప్రమేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బన్సిలాల్ హరికిషన్ జువెల్లరీ నగల దుకాణంలో మంచిర్యాలకు చెందిన వాడయి సాగర్ గత తొమ్మిది నెలలుగా జూనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంతో నమ్మకంగా పని చేశాడు. ఈ నెల 4నుంచి పనిలోకి రావడం మానేసి కనిపించకుండా పోయాడు. అతడి వద్ద ఉండాల్సిన రూ.20లక్షల విలువైన ఆభరణాలు లెక్కల్లోకి రాలేదు. ఈ నెల 18న యజమాని బానోతు ప్రేమ్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శుక్రవారం సాగర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో గత మార్చి 10న రౌడీషీటర్ ఎరగుంట సంపత్‌పై జరిగిన దాడి కేసులో ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసి అదేరోజు ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తప్పించుకుని తిరుగుతున్న మంచిర్యాలకు చెందిన నలిగేటి వివేక్, రంజిత్ వర్మను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

పోడు కోసం చెట్ల నరికివేత

- నేలకొరిగిన సుమారు 150పైగా చెట్లు
- అడ్డుకున్న అటవీ సిబ్బందిపై దాడి
- 50మంది ఆదివాసీలపై కేసు



గొడ్డలి వేటుకు నేలకొరిగిన టేకు చెట్లు

జన్నారం: ఆదివాసీలు, అటవీశాఖ పోరులో విలువైన టేకు చెట్లు నేలకొరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజనులు అడవిలో తిష్టవేసి చెట్లు నరికి భూమి చదును చేసేందుకు యత్నిస్తున్నారు. అడ్డు వెళ్లిన ఇద్దరు అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కవ్వాల్ టైగర్‌జోన్, జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్, కవ్వాల్ అటవీ సెక్షన్, సోనాపూర్ తండా బీట్‌లోని పాలఘోరీల ప్రాంతంలో 40రోజులుగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, సిర్పూర్, లింగపూర్ మండలాలకు చెందిన సుమారు 100మంది ఆదివాసీ గిరిజనులు ఆవాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. తమ పూర్వీకులకు చెందిన భూమి ఈ ప్రాంతంలో ఉన్నట్లు చెబుతున్నారు. తమ వద్ద సదరు భూమికి సంబంధించిన కాగితాలున్నాయని, అందుకే ఈ భూమి తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ భూమి అటవీశాఖకు సంబంధించిందని, ఈ భూమిపై ఆధారాలుంటే కలెక్టర్ లేదా రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని సూచించారు. అయినా వినకుండా, 20రోజుల క్రితం సుమారు 150టేకు చెట్లు నరికివేశారు. అప్పుడు 30మందిపై కేసు నమోదు చేశారు.

మరో 150వరకు చెట్ల నరికివేత

అధికారుల కౌన్సిలింగ్ అనంతరం కొన్ని రోజులు నిశబ్దంగా ఉన్న ఆదివాసీ గిరిజనులు గురువారం రాత్రి వారుంటున్న అటవీ ప్రాంతం పరిసరాల్లో సుమారు 150 చెట్లు నరికివేశారు. అడ్డు వెళ్లిన బీట్ అధికారి ప్రణయ్, బేస్‌క్యాంపు వాచర్ వెంకటకృష్ణపై దాడికి పాల్పడ్డారు. వారిని అక్కడ నుంచి కర్రలతో తరిమేశారు. దీంతో భయంతో వారు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధర్‌చారి, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పడిపోయిన చెట్ల వివరాలు సేకరించారు. చిన్నవి, పెద్దవి కలిసి సుమారు 150కి పైగా చెట్లు నరికివేసినట్లు తెలిపారు.

50మందిపై కేసు నమోదు

పాలఘోరీల ప్రాంతంలోని అడవిలో చెట్లు నరికివేయడమే కాకుండా అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన 50మంది ఆదివాసీ గిరిజనులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అడవిలో చెట్లు నరికివేయడమే కాకుండా ఇద్దరు సిబ్బందిపై దాడి చేశారని కవ్వాల్ డిప్యూటీ రేంజ్ అధికారి విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 50మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఆదివాసీలకు సీఐ కౌన్సిలింగ్



ఆదివాసీలతో మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

జన్నారం అటవీ డివిజన్ కవ్వాల్ అటవీ సెక్షన్ పాలఘోరీల్లో నివాసముంటూ అడవిలోని చెట్లు నరికివేసిన ఆదివాసీ గిరిజనులతో శుక్రవారం సాయంత్రం లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి మాట్లాడారు. అడవుల నరికివేతపై వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అడవిలోని చెట్లు నరికివేయడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. చెట్లు నరికితే కేసులవుతాయని హెచ్చరించారు. భూమికి సంబంధించిన ఆధారాలుంటే అధికారుల వద్దకు వెళ్లి సమస్య పరిష్కరించుకోవాలని, చట్ట విరుద్ధంగా అడవిలో ఉంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఇది పూర్తి అడవి ప్రాంతమని ఖాళీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు అనూష, తహసీనొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

చెట్లు నరకడం సరికాదు

టైగర్‌జోన్ కోర్ ప్రాంతమైన పాలఘోరీల వద్ద ఎక్కడి నుంచో వచ్చి విలువైన టేకు చెట్లు నరికివేయడం సరికాదు. గతంలో కూడా 150 చెట్లు నరికివేశారు. గురువారం కూడా మరోసారి చెట్లు నరకడం దారుణం. చట్టప్రకారం వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తాం. భూమికి సంబంధించిన పత్రాలుంటే చట్టప్రకారం అధికారులను కలిసి సమస్య పరిష్కరించుకోవాలి. కానీ.. ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టారీతిన చెట్లు నరకడం సరికాదు.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

ఎనిమిదో పే కమిషన్ ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి: రైల్వే కార్మికులకు ఎనిమిదో పే కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలోని సీఅండ్‌డబ్ల్యూ డిపో షెడ్, లోకో పైలట్ క్రూ లాబీ ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే కార్మికులపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల శ్రమను గుర్తించడం లేదని పేర్కొన్నారు. ఈపాటికే ఎనిమిదో వేతన కమిషన్‌ను అమలు చేయాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో రైల్వే కార్మికులు వేతన పెంపుదల లేక తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. వేతన సంఘాన్నీ ప్రకటించి జనవరి 2026 నుంచి భేషరతుగా అమలు చేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సాంబశివుడు, కోశాధికారి షోకిన్ మీనా, నాయకులు నిరాజ్, అగర్వాల్, శంకరయ్య, కార్యకర్తలు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని స్థాపించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

తాండూర్: టీబీ రహిత సమాజాన్ని స్థాపించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ నిర్వహించిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ పేషెంట్లు మందులతో పాటు బలమైన పోషకాహారం తీసుకుంటే చాలా తొందరగా కోలుకోవచ్చని పేర్కొన్నారు. టీబీ రహిత సమాజం కోసం టీబీ న్యూట్రిషియన్ కిట్‌లు అందించాలని పిలుపునిచ్చారు. దీంతో పాటు స్వస్త్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా స్పెషలిస్ట్ డాక్టర్ రఘుమోహన్ ఆధ్వర్యంలో 87మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఝాన్సీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జయమేరి, సూపర్‌వైజర్లు తార, రమాదేవి, స్టాఫ్ నర్సులు షారుణ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో కలప వర్క్‌షాప్ సీజ్

భీమారం: మండల కేంద్రంలోని నల్లాల రాజలింగుకు చెందిన కలప వర్క్‌షాప్‌ను శుక్రవారం సాయంత్రం సీజ్ చేసినట్లు అటవీశాఖ మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో స్మగ్లర్లు నరికిన టేకుచెట్లనురాజలింగు షాపులో అమ్ముతున్నారని విచారణలో తేలిందని పేర్కొన్నారు. అతని కుటుంబానికి చెందిన టింబర్ డిపోను సీజ్ చేసినట్లు తెలిపారు.వర్క్‌షాప్‌లో లభించిన టేకు కలప పట్టుకున్నట్లు రేంజ్ ఆఫీసర్ పేర్కొన్నారు. పట్టుకున్న కలప విలువ ఎంత అనేది తెలియాల్సి ఉందని తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, ఎఫ్ఏవో రామకృష్ణ సర్కార్, సిబ్బంది పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో ఏఐపై ప్రత్యేక శిక్షణ



విద్యార్థులతో వీసీ గోవర్ధన్, నిర్మాత దిల్ రాజు

బాసర: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో టీజీఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్‌తో కలిసి ప్రత్యేక ఇంటరాక్టివ్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రపరిశ్రమలో కృత్రిమ మేధస్సు (ఏఐ) పాత్ర, సృజనాత్మకత, కథనం, నిర్మాణ సామర్థ్యం, కంటెంట్ డెలివరీలో దాని ప్రభావంపై చర్చించారు. అదే సమయంలో, ఐఈఈఈ విద్యార్థి శాఖ, ఈసీఈ విభాగం కార్యాలయం ప్రారంభించారు. దిల్ రాజు మాట్లాడుతూ.. చిత్ర నిర్మాణంలో ఏఐ పాత్రను వివరించారు. ఏఐ పరిశ్రమలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను ఉపాధి అవకాశాలతో సమన్వయం చేయడానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

సాంకేతిక ఆవిష్కరణలకు వేదిక

ఈ సదస్సులో ఐఈఈఈ హైదరాబాద్ విభాగం సభ్యులు, ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్‌తోపాటు దిల్ రాజు ఐఈఈఈ ప్రపంచ ప్రభావం, సాంకేతిక పురోగతిపై చర్చించారు. 39 గ్లోబల్ సొసైటీలు, 20 సెక్షన్ల ద్వారా సాంకేతిక సహకారం, అభ్యాసాన్ని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఐఈఈఈ విద్యార్థి శాఖ కౌన్సిలర్ డాక్టర్ నామాని రాకేశ్, చైర్‌పర్సన్ జి.వంశీ శాఖ అభివృద్ధి కోసం తమ ప్రణాళికలను పంచుకున్నారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులను పరిచయం చేస్తూ రాబోయే కార్యక్రమాల గురించి తెలియజేశారు.

పోలీసులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

- అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్
- కుభీర్ ఘటనలో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ అవినాష్ కుమార్

భైంసాటౌన్: పోలీసులపై ఎవరైనా దాడులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్ హెచ్చరించారు. కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌పై దుండగుడు కత్తితో దాడి చేసిన కేసు వివరాలను శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన అబ్దుల్ కలీం (51)కు కుభీర్ మండలకేంద్రానికి చెందిన మహిళతో వివాహం కాగా, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తేవి. ఈ క్రమంలో భార్య కుభీర్‌లోని తన పుట్టింటికి రాగా, మరోసారి ఇద్దరి మధ్య తగాదా తలెత్తింది. దీంతో తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తానని భార్య భర్తను బెదిరించగా, అదే రోజు రాత్రి మద్యం మత్తులో నిందితుడు అబ్దుల్ కలీం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్సై గదిలోకి వెళ్లబోయాడు. దీంతో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నారాయణ అడ్డుకునే యత్నంలో కత్తితో గాయపర్చి పారిపోయాడు. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలతో గాలించగా శుక్రవారం కుభీర్ శివారులో నిందితుడిని అరెస్ట్ చేశారు. అబ్దుల్ కలీం గతంలో ధర్మాబాద్‌లోనూ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో వెల్లడైందని అదనపు ఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐలు గోపీనాథ్, నైలు, కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత



ఆర్టీసీ బస్సును ఢీకొన్న పశువులు తరలిస్తున్న వాహనం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు పశువులను తీసుకెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. పది పశువులను స్వాధీనం చేసుకుని స్థానిక జైశ్రీరాం గోశాలకు తరలించారు. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం శుక్రవారం ఉదయం నిర్మల్ బైపాస్ వద్ద వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బొలెరో వాహనంలో పశువులు ఉన్నట్లు గమనించారు. స్థానికులను చూసిన వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని బొలెరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి పశువులను గోశాలకు అప్పగించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఈ ఘటనలో బస్సు కండక్టర్‌కు స్వల్పగాయాలు కాగా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బలవంతంగా యువతి పెళ్లికి యత్నం

- అక్రమ రవాణా కేసులో ఒకరి అరెస్ట్

భైంసాటౌన్: పెళ్లి పేరిట యువతిని ఓ దివ్యాంగుడికి విక్రయించేందుకు యత్నించిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు భైంసా అదనపు ఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలు.. కుభీర్ మండలం మార్లగొండకు చెందిన రాథోడ్ రామారావు అదే మండలంలోని సేవాదాస్‌నగర్‌కు చెందిన చౌహాన్ లీ కూతురు (25)కు పెళ్లి సంబంధం పేరిట నమ్మించాడు. లోకేశ్వరం మండలానికి చెందిన వరుడు (దివ్యాంగుడు)కు ఒక కాలు లేదని, అమ్మాయిని బాగా చూసుకుంటాడని నమ్మబలికాడు. దీంతో నమ్మిన యువతి కుటుంబీకులు ఈనెల 12న భైంసా పట్టణంలో పెళ్లి చూపులకు రాగా, వరుడు పూర్తి దివ్యాంగుడు కావడంతో యువతి పెళ్లికి నిరాకరించింది. అయితే, మధ్యవర్తిగా ఉన్న రాథోడ్ రామారావు రూ.లక్ష ఇప్పిస్తానని యువతి తండ్రిని ఒప్పించేందుకు యత్నించగా, అతను ససేమిరా అన్నాడు. అయినా, రామారావు యువతిని బలవంతంగా వాహనంలోకి ఎక్కించేందుకు ప్రయత్నించగా, ఆమె కేకలు వేసింది. దీంతో రామారావు పారిపోయాడు. ఈ మేరకు యువతి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రామారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

పత్తిలో చీడపీడలు

- అధిక వర్షాలకు తప్పని బెడద
- దిగుబడిపై పడనున్న ప్రభావం
- దిగులు చెందుతున్న రైతులు



ఆస్నాద సమీపంలో ఏపుగా పెరిగిన పత్తి మొక్కలు



తెగులు సోకి పండువారుతున్న ఆకు

చెన్నూర్‌రూరల్: ఈసారి పత్తి పంట ఆశాజనకంగా ఉంది. కానీ.. అధిక వర్షాలు కురిసిన చోట పంటను చీడ, పీడలు ఆశిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలంలో 1.61లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. దుక్కి, దున్నడం, విత్తనాలు, క్రిమిసంహారకాలు, ఎరువుల కోసం ఒక్కో ఎకరాకు సుమారు రూ.30వేల నుంచి రూ.45వేల వరకు ఖర్చు చేశారు. మొదట పత్తి విత్తనాలు వేసిన సమయంలో సరిగా వర్షాలు కురవలేదు. మొలకెత్తక పోవడంతో కొందరు రైతులు మళ్లీ విత్తనాలు వేశారు. ఆగస్టు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండగా ప్రస్తుతం పంటకు చీడపీడలు సోకుతున్నాయి. క్రిమిసంహారకాలు పిచికారీ చేద్దామంటే రోజూ వర్షం కురుస్తోంది. ఇప్పుడే పత్తి పూత దశలో ఉంది. కొన్ని చోట్ల కాయ దశలో ఉంది. పచ్చ దోమ, తెల్ల దోమ ఆశించి మొక్కల అడుగు భాగం నుంచి పత్రహరితాన్ని పీలుస్తున్నాయి. దీంతో ఆకులు మొదట పచ్చబారి, ఆ తరువాత ఎరుపు రంగులోకి మారుతున్నాయి. ఆకులు కింది వైపునకు ముడుచుకుపోతున్నాయి. చెట్టు కొనలు ముడుచుకుపోయి పెరుగుదల తగ్గి, పూత, కాత తగ్గనుంది. ఈ పురుగులు రసం పీల్చడంతో గూడలు బలహీన పడతాయి. పిందె పరిమాణం తగ్గుతుంది. ఈ కారణంగా దిగుబడి కూడా తగ్గిపోయే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత నిలవడం లేదు



నేను నాలుగెకరాల్లో పత్తి పంట సాగు చేసిన. వర్షాలకు పత్తి ఏపుగానే పెరిగింది. కానీ చీడ, పీడలు సోకినయ్. పూత, గూడ నిలవడం లేదు. దోమ, పురుగుతో ఆకులన్నీ రంధ్రాలు పడుతున్నయ్. తెగులు సోకి ఆకులు పసుపు రంగులోకి మారి రాలి పోతున్నయ్. ఇలా అయితే దిగుబడి తగ్గుతుంది.

– ఇంగిలి రవి, రైతు, ఆస్నాద

నివారణ చర్యలు చేపట్టాలి



పత్తిలో రసం పీల్చే పురుగు నివా రణకు ఎసిటా మిప్రిడ్ 20శాతం 30 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి. లేదా డైపెంథ్యూరాన్, ఇమామెక్టిన్ 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా ఎసీఫేట్ 75 శాతం మందును 250 గ్రాములు తీసుకుని 150 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు డైఫ్నొకొనజోల్, మాంకోజెబ్ మందులు పిచికారీ చేసుకోవాలి.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

నాటుసారా స్థావరాలపై దాడులు



పట్టుకున్న నాటుసారా, నిందితుడితో ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్, మంచిర్యాల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం నాటుసారా స్థావరాలపై ఆకస్మిక దాడులు చేశారు. బెల్లంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మందమర్రి మండలం పులిమడుగు, కాసిపేట మండలం ధర్మారావుపేట, మామిడి గూడెం గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పులిమడుగు గ్రామానికి చెందిన బానోత్ అంబ్రియా, బూక్యా దేవి, ధర్మారావుపేట గ్రామానికి చెందిన బానోత్ లక్ష్మి, బానోత్ రాజు వద్ద 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఈమేరకు నలుగురు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. దాడుల్లో మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.సమ్మయ్య, ఎస్సైలు శారద, వెంకటేశ్, సిబ్బంది అశోక్, దినేశ్, గణేశ్, శిరీష, సాగర్, రమేశ్, ప్రశాంత్, కవిత పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



నాందేవ్ మృతదేహం

రెబ్బెన: మండలంలోని నంబాలలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి అదే గ్రామానికి చెందిన గంగుల నాందేవ్ (35) అనే డ్రైవర్ మృతి చెందాడు. రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నాందేవ్ నంబాల గ్రామానికి చెందిన పూదరి బానేశ్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌ను కడిగేందుకు గ్రామంలోని మన్నెగూడ సమీపంలోగల చెరువు వద్దకు అదే గ్రామానికి చెందిన ఎర్గటి రవితో కలిసి వెళ్లాడు. ఇద్దరు కలిసి ట్రాక్టర్‌ను కడిగిన తర్వాత తిరిగి గ్రామానికి వచ్చే క్రమంలో రవి ట్రాక్టర్ నడపగా నాందేవ్ పక్కన కూర్చున్నాడు. అయితే మార్గమధ్యలో రవి మలవిసర్జన కోసమని ట్రాక్టర్‌ను దారి పక్కన నిలిపి వెళ్లగా నాందేవ్ రవికి చెప్పకుండా ట్రాక్టర్ తీసుకునివెళ్లాడు. అయితే, మార్గమధ్యలోని జెడ్పీ హైస్కూల్ వద్దకు చేరుకోగా రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల చెట్టును తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. గమనించి పాఠశాల విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలుపగా వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో గ్రామానికి చెందిన బక్క రాకేశ్, పూదరి సన్నీ, పూదరి గణేశ్ ఘటనా స్థలానికి చేరుకుని నాందేవ్‌ను రెబ్బెన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి నాందేవ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి అన్న పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో కాంట్రాక్టు కార్మికుడి మృతి



శంకరయ్య (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ కాంట్రాక్టు కార్మికుడు రేణికుంట శంకరయ్య(53) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీ పరిధిలోని క్వార్టర్లలో పనికి వెళ్లిన శంకరయ్య ఉదయం 10.30గంటలకు ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు కంపెనీ డిస్పెన్సరీకి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. రూ.20లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని కంపెనీ గేటు ముందుకు తీసుకువచ్చి ఆందోళన చేయనున్నట్లు తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా మంచిర్యాలకు చేరుకుని నివారించారు. మానవత కోణంలో రూ.లక్ష వరకు ఖర్చుల నిమిత్తం సహాయం అందిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కంపెనీ అధికారులు తెలిపినట్లు సమాచారం. మృతదేహం పోస్టుమార్టం అనంతరం శనివారం గ్రామానికి చేరనుండడంతో శుక్రవారం ఆందోళనలు నిర్వహించలేదు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 20-9-2025



'రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి' అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.

తొలి అడుగు

ఫస్ట్ క్లాస్ జర్నీ

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...

'నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు' అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.

నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.

ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదు గురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీయిడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీయిడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నెలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్ట్రన్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు-ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపక పోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ 'శభాష్' అనిపించుకుంది సురేఖ.

'దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది' అంటుంది సురేఖ.

గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది. 2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.





కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

'ట్రెయిన్ నడపడం అంటే మాటలా!'లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్

ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

'ఆడవాళ్ల ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.



ఘనమైన వీడ్కోలు

సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్‌ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.

'సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి' అన్నారు వక్తలు.

వంటిల్లు

అమ్మకు నైవేద్యం

దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిసి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్లు కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్లు వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్లు తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ,
మీ థాట్ హోమ్ డిలైట్



రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని 'బాక్సర్‌ల కుటుంబం' అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన బుఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. 'అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది' అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందర పడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన 'వరల్డ్ బాక్సింగ్ కప్'కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా 'ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా' అంటూ 'ఎక్స్' వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో 'తూమక్ తూమక్' అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన 'తూమక్ డ్యాన్స్' ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్‌ఫెక్ట్‌గా అనుసరించి 'వారేవా' అనిపించారు.

'మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వంద సార్లు చూసి ఉంటాను' అన్నాడు ఒక యూజర్.

'నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?' అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాసిన్ 'జుట్టి మేరీ' ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు



ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్లుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

'తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను' అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకువచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –"గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా 'ఆన్-సైట్' వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో-డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయంలో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో-టాయిలెట్లు, పబ్లిక్- కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో-టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో-ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

> దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం" అని చెప్పారు నమిత.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్య. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను 'సత్రినై' అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) సెప్టెంబర్ 19న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	1,13,500	1,11,330	1,13,500	1,14,050	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	1,02,050	1,02,050	1,05,110	1,04,930	1,02,300
వెండి	1,33,500	1,33,800	1,43,000	1,33,800	1,33,300	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.